# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 8, అక్టోబర్ 2025






### ఆదివాసుల ఆరాధ్యదైవం, పోరాటయోధునికి

# ఘన నివాళి

- అసువులు బాసిన నేల జోడేఘాట్‌లో 85వ వర్ధంతి
- నివాళులు అర్పించిన మంత్రులు జూపల్లి, అడ్లూరి లక్ష్మణ్

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో / కెరమెరి, అక్టోబర్ 07, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం పరిధిలోగల పోరాటాల గడ్డ, గిరిజనుల హక్కుల కోసం (జల్, జంగల్, జమీన్) అని నైజాం సైన్యంతో పోరాడి అసువులు బాసిన జోడేఘాట్‌లో కుంరం భీమ్ 85వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ లాంచనాలతో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటిడిఏ పిఓ కుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో ఘనంగా మిగతా 2లో..



### మహనీయుల ఆశయాలు

# మనందరికీ స్ఫూర్తిదాయకం

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త

మహనీయుల ఆశయాలు మనందరికీ స్ఫూర్తిదాయకమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి, కొమురం భీం వర్ధంతి వేడుకలలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి హాజరై వాల్మీకి, కొమురం భీం చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని అన్నారు. సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యాలను మనకు అందించింది మహర్షి వాల్మీకి రచించిన రామాయణం అని, ప్రపంచానికి కర్తవ్య బోధన చేసిన మహా గ్రంథం అని అన్నారు. సత్యం, నీతి, ధర్మ మార్గాలను రామాయణం ద్వారా భవిష్యత్తు తరాలకు అందించారని, వాల్మీకి బోధనలు న్యాయం, సమానత్వ స్థాపనకు ప్రేరణగా నిలిచాయని అన్నారు. ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురం భీమ్ అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచి పోరాడిన వీర యోధుడు, ఆదివాసీల ముద్దుబిడ్డ మిగతా 2లో..



# తుమ్మిడి హెట్టిలో పర్యటించిన అధికార యంత్రాంగం



- ప్రాజెక్టు ప్రారంభానికి అడుగులు వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- ప్రాజెక్టు పునః ప్రారంభించాలని సిపిఐ (ఎం) అధికారులకు వినతి పత్రం

కౌటాల, అక్టోబర్ 7, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండలంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు పున: ప్రారంభించాలని మంగళవారం రోజున రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలనాకు పంపించడం జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సత్యరాజచంద్ర, మిగతా 2లో..



# ఆదివాసుల ఆరాధ్యదైవం, పోరాటయోధునికి ఘన నివాళి

(మొదటిపేజీ తరువాయి)



నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్ముఖ్ఖుమ్మణ్, కొమురం భీం మనవడు కుమరం సోనేరావుతో కలిసి జోడేఘాట్‌లో కొమరం భీమ్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివాసుల సంస్ఖృుతి ప్రకారం జెండా పండుగలో పాల్గొని కొమురం భీం, కొమురం సూరులకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధన కోసం నియంతృత్వ నైజాం ప్రభుత్వంతో పోరాడిన గోండు వీరుడు కొమురం భీం అని అన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాడి తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన వీరుడు కుమ్రం భీమ్ అని అన్నారు. గిరిజనుల ఆత్మగౌరవ ఉద్యమాలకు మార్గదర్శకుడని పేర్కొన్నారు. గిరిజన పోరాట యోధుడు, మా ఆరాధ్య దైవం అయిన కుంరం భీం జల్ జంగల్ జమీన్‌చ (నీరు, అడవి, భూమి) హక్కుల కోసం పోరాడిన వీరుడని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజన సంస్ఖృుతి, ఆచారా వ్యవహారాలు, సంప్రదాయ పద్ధతుల గురించి ప్రజలకు తెలియజేయడం, గిరిజనులకు కొమురం భీం స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కుమురం భీం ఆశయ సాధనకు ఫలితంగా రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు అటవీ భూమి పై హక్కులు కల్పిస్తూ 2005లో చట్టాన్ని తెస్తూ గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కొమురం భీం వారసులకు అధికారులు నూతన వస్త్రాలను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్యాం నాయక్, అదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై గుంతలు పూడ్చాలంటూ టీబీ ఎస్ఎస్ వినతిపత్రం

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త**



రామకృష్ణాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల రోడ్లపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని మున్సిపల్ కమిషనర్‌ను తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం (టీబీ ఎస్ఎస్) నాయకులు కోరారు. మంగళవారం సంఘం అధ్యక్షుడు, అడ్వకేట్ రాజలింగు మోతె ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో గుంతల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో చిన్నా పెద్దా ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, వాహనాలు దెబ్బతింటున్నాయని వివరించారు. స్కూల్ విద్యార్థులు, వృద్ధులు రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షం పడినపుడు నీరు నిలిచి ప్రయాణం కష్టతరంగా మారుతోందన్నారు. సంబంధిత అధికారులను ఆదేశించి, గుంతలు పూడ్చే పనులను తక్షణమే ప్రారంభించాలని సంఘం నాయకులు కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం సమర్పణలో దాసరి స్వరాజ్యం, సప్పిడి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మిడి హెట్టిలో పర్యటించిన అధికార యంత్రాంగం

(మొదటిపేజీ తరువాయి)



కౌటల తహసిల్దార్ ప్రమోద్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తుమిడి హెట్టి ప్రాణహిత వద్ద నది నీటి లభ్యత, ప్రవాహం, భూమి స్థితి గురించి ఆరా తీశారు.

### సిపిఐ (ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో

### అధికారులలకు వినతి పత్రం.....

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్డిహెటి వద్ద ప్రాణహిత నదిపై వెంటనే ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణ పనులు పునః ప్రారంభించాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గోదావరి ఉపనది ప్రాణహితపై నిర్మించ తలపెట్టిన ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వెంటనే తిరిగి ప్రారంభించాలి అన్నారు. నది నుండి 160 టీఎంసీల నీటిని శ్రీపాద ఎల్లంపల్లికి తరలించాలి, ఎల్లంపల్లి నుండి రంగారెడ్డి జిల్లా శామీర్ పేట్ వరకు తరలించి 16.40 లక్షల ఎకరాలకు సాగు నీరు, హైద్రాబాద్, సికింద్రాబాద్ నగరాలకు త్రాగునీరు మరియు పరిశ్రమలకు నీటిని అందించాలని. తుమ్డిహెట్టి వద్ద 5 నుండి 15 కిలోమీటర్ల వరకు ఉన్న ప్యాకేజీని రాంకి సంస్థకు అప్పగించారని. 15 నుండి 28 కిలోమీటర్ల వరకు ఉన్న ప్యాకేజీని మైటాన్ సంస్థకు అప్పగించారన్నారు. 2006 లో మొబిలైజేషన్ అడ్వాన్స్ లు తీసుకున్నారని, కాలువ పనులు, ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలుపూర్తి కాకుండానే ఆగిపోయాయని. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 20.21 లక్షల ఎకరాల ఆయకటు ఉందని. ఇక్కడ వర్షపాతం 1061 మి.మీటర్లు ఉందని. ఉపరితల నీటి లభ్యత లేదన్నారు. 41.85 టీఎంసీల భూగర్భజలాల లభ్యత ఉందని. భారీ, మధ్య తరగతి ప్రాజెక్టులకు 116 టీఎంసీల నీరు కావాలన్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద ఆయకట్టును పరిశీలిస్తే 100 ఎకరాలకు పైబడిన చెరువులు 339 ఉండగా, వీటి కింద ఆయకట్టు 71,684 ఎకరాలు, అదే విధంగా 100 ఏకరాలకు లోబడిన చెరువులు 1279 ఉండగా, వీటి కింద ఆయకట్టు 36,237 ఎకరాలు ఉన్నాయని. మొత్తం 1,618 చెరువులుండగా వాటి కింద 1,07,921 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు, చాలా చెరువులకు మరమ్మత్తులు లేవన్నారు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి వనరులున్నప్పటికీ వాటిని వినియోగించడం లేదన్నారు, దశాబ్దాల తరబడి ప్రాజెక్టుల నిర్మాణాలు ఆగిపోతున్నాయని. దీని కారణంగా జిల్లా వెనుకబడిపోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కీ. శే!! డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించి నీటిని విడుదల చేసిన మత్తడి వాగు, ర్యాలీ వాగు, సుద్ద వాగు ప్రాజెక్టుల నుండి నేటికీ నీటి పారకం లేదన్నారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు అతీగతీ లేవని. కాగజ్‌నగర్ సమీపంలోని జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు, ఆసిఫాబాద్ సమీపంలోని కుమురంభీం (అడ) ప్రాజెక్టులు దశాబ్దాలు గడిచినా ఇంకా నిర్మాణ దశలోనే ఉండడం ఈ జిల్లాపై పాలకులకు ఉన్న శ్రద్ధను బహిర్గతం చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జిల్లాలోని బెజ్జూరు, దహెగాం, కౌటాల, చెన్నూరు, జైపూర్, కోటపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాలకు చెందిన 127 గ్రామాల్లోని 1,66,600 ఎకరాలకు సాగునీరు త్రాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం ముందుకు రావడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ స్వాగతిస్తోందన్నారు. దీని నిర్మాణానికి తక్షణం తగు చర్యలు తీసుకొని పని పునః ప్రారంభించి 2028 సీజన్ నాటికి పని పూర్తి చేసి ఉభయ జిల్లాల రైతులకు మేలు చేకూర్చగలరని విన్నవించుకున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కూశన రాజన్న జిల్లా కార్యదర్శి ఉన్నారు.

## మహనీయుల ఆశయాలు

# మనందరికీ స్ఫూర్తిదాయకం

(మొదటిపేజీ తరువాయి)

కొమురం భీం అని అన్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమరి మండలం జోడేఘాట్‌లో జన్మించి ఆదివాసి గిరిజనుల సంక్షేమం కోసం నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి వీరోచిత పోరాటం చేశారని, ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ప్రభుత్వం మహానుభావుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, వారి ఆదర్శాలను భావితరాలకు స్ఫూర్తిగా అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదమంచున ప్రయాణం

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో నిత్యం తిరిగే ఉట్నూరు డిపో ఆర్టీసీ బస్సు ఇచ్చోడ మీదుగా బజార్ హత్నూర్, సోనాల కిన్వట్ వెళ్తుంది. ఫ్రీ బస్సు కారణంగా ప్రజలు పరిమితికి మించి ఎక్కుతున్నారు. ఈ ప్రయాణంతో జరగకూడనిది ఏమైనా జరగొచ్చు. ప్రజలు ప్రమాదం అని తెలిసిన వెళ్లక తప్పడం లేదు.



## కిషన్ కాపాస్ యాప్‌ను బహిష్కరించిన రైతులు

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కిషన్ కపాస్ యాప్ పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సును రైతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాత పద్ధతి ప్రకారంగానే సీసీఐ ద్వారా పత్తి పంట కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా లాభాల కంటే ఎక్కువగా నష్టాలే ఉన్నాయని వివరించారు. వ్యవసాయం చేసే రైతులు ఎక్కువ శాతం నిరక్షరాస్యతనే ఉంటుంది. రైతు లందరి దగ్గర స్మార్ట్ ఫోన్లు ఉండవని, ఎక్కడో మారుమూల గ్రామాల్లో సిగ్నల్స్ సైతం సరిగ్గా రావని వారు తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని సూచించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు.

## చెత్త రోడ్డు పైనే..

**దహెగాం, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

పల్లెల్లో పారిశుద్యం పరిశుభ్రంగా ఉంటే ప్రజలందరూ రోగాల బారినపడకుండా ఆరోగ్యాంగా ఉంటారు. కానీ కొన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యన్ని పట్టించుకోవడం లేదు. రోడ్లపై మురుగు నీరు పారడం వలన రోడ్డు చెడిపోయి వాహనదారులకు చాలా ఇబ్బంది కలుగుతుంది డ్రైనేజి వ్యవస్థ సరగలేదు. దహెగాం మండలంలో బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. చెత్తకుండి లేదు రోడ్డు పై వేయడం వలన చెత్త చెల్ల చెదురు అయి దుర్గంధం వెదజల్లుతోందని వాహనదారులకు, గ్రామంలోని ప్రజలు చాలా ఇబ్బందులకు గురౌతున్నారు. సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు చెత్తకుండి ఏర్పాటు చేయాలనీ గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# కుమ్రంభీమ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**కెరమెరి, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

ఆదివాసుల ఆరాధ్య దైవం, అమరజీవి కుమ్రంభీమ్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరమెరి మండలం జోడెన్ ఘాట్‌లో ఆదివాసుల ఆరాధ్య దైవం కుమ్రంభీమ్ 85వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్.పి. కాంతిలాల్ సుభాష్ పాటిల్, ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా గిరిజనాభివద్ధి అధికారి రమాదేవి, కుమ్రంభీమ్ మనుమడు కుమ్రం సోనే రావు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. గిరిజన సంప్రదాయబద్ధంగా జండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కుమ్రంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి సమాధి వద్ద నివాళులు అర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుమ్రంభీమ్ మనుమడు కుమ్రం సోనే రావు దంపతులకు నూతన వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో గిరిజనుల అభివృద్ధికి, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రంభీమ్ అని అన్నారు. భీమ్ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమంలో ముందుకు సాగుదామని తెలిపారు. కుమ్రంభీమ్ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. కుమ్రంభీమ్ వర్ధంతి కార్యక్రమానికి వచ్చేందుకు హట్టి నుండి జోడెన్ ఘాట్ వరకు ఉచితంగా ప్రయాణించేందుకు బస్సులు నడిపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




**సారంగాపూర్, అక్టోబర్ 07, ప్రభాత వార్త**

మండలంలోని స్వర్ణ గ్రామంలో ఆదివాసీల ఆధ్వర్యంలో కొమరం భీమ్‌కు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ మా కోసం జల్, జంగిల్, జమీన్ నినాదంతో మా హక్కుల కోసం నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసి, మా అందరినీ ఐక్యం చేసి మా కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప త్యాగమూర్తి ఇతను. ఇతని ద్వారానే బ్రిటిష్ భూమి పై హక్కు కల్పించారు. వారి కాలంలోనే పోడు హక్కుల చట్టం తీసుకురావడం జరిగింది. దానితో భూములపై అధికారం లభించింది. అధికంగా వసూలు చేస్తున్న పనులను కూడా తగ్గించి, అడవులలో నివాసలను గుర్తించారు. అంతేకాకుండా రాష్ట్రలలో మాకు పోడు హక్కులు కల్పించారు. వాటి ద్వారానే మాకు భూములపై అధికారం లభించింది. వారి 85 వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ప్రభుత్వాని ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటునాము అని అన్నారు.

**పెంచికల్ పేట్, అక్టోబర్ 07,ప్రభాతవార్త :**

కొమరం భీమ్ స్ఫూర్తి నేటికీ అజరామరం అని ఆదివాసీ గిరిజన నాయకులు అన్నారు. మంగళవారం పెంచికల్ పేట్ మండలంలోని జిల్లేడ, కమ్మర్గం గ్రామాల్లో ఆదివాసీల ఆధ్వర్యంలో కొమరం భీమ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం నిజాం సర్కారుతో అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కొమరం భీమ్ అని అన్నారు. అయన ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీల హక్కుల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో మహిళలు యువకులు ప్రజలు పాల్గొన్నారు..



**బజార్‌హత్నూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సాంగ్వి గ్రామంలో కొమురం భీం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఆదివాసి హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన గిరిజన ఆరాధ్య దైవం కొమురం భీం. అడవులను ప్రేమించి నిజాం అరాచకాలపై గర్జించి తమ భూములు తమకే సొంతం అని జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఉద్యమించాడు. నిజాం సర్కారు గుండెల్లో సింహ స్వప్నంగా మారడని, 1940 అక్టోబర్ 27న జోడే ఘాట్‌లో వారిని హతమార్చారని చెప్పుకొచ్చారు. ఆదివాసీలు పవిత్రంగా భావించే అశ్వియుజ శుద్ధ పౌర్ణమి రోజున మరణించడంతో వర్ధంతి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని డోలు, సన్నాయి వాయిస్తూ కొమరం భీమ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి వర్ధంతి వేడుకలు విజయవంతం చేశారు.

**నేరడిగొండ, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

జల్ జంగల్ జమీన్ కోసం పోరాడుతూ ప్రాణాలు వదిలిన ఆదివాసీ ఆరాధ్య దైవం కొమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా నెరడిగొండ మండలంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వగృహంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన ఆదివాసీ ఆరాధ్య దైవం కొమురం భీం జ్ఞాపకార్థం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 25 కోట్లతో మ్యూజియం నిర్మించారని గుర్తుచేశారు. మావ నాటే మావ రాజ్ కళను సాకారం చేసి వారి గ్రామాల్లో వారికే అధికారం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, రూప్ చాంద్, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**లింగాపూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త**

మండలంలోని ఆదివాసి వీరుడు కొమరం భీమ్ 85వ వర్ధంతి సందర్భంగా రెహమాన్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీక్ జిలాని ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి వీర మరణం పొందిన. కుమ్రం భీం విగ్రహానికి పూలమాలవేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. కొమురం భీం మనవడు కుమ్రం సోనేరావును మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆయనతో సాధారణంగా మాట్లాడారు. అమరజీవి కొమరం భీమ్ కుటుంబాన్ని గౌరవించడం ద్వారా తరం నుంచి తరానికి. త్యాగం, ధైర్యం, గౌరవం అనే విలువలు సజీవంగా ఉంటాయని ఆకాంక్షించారు. అమరజీవి కొమరం భీమ్‌ను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. వారి ఆత్మస్ఫూర్తి ప్రతి ఒక్కరిలో నిలవాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ జల్ జంగల్ జమీన్ మా హక్కు అంటూ నినాదాలతో గర్జించారు. ఈ కార్యక్రమంలో చెప్పడే లక్ష్మణ్, ఏంలే విశ్వనాథ్, వత్తే ప్రలాద్, పటాన్ సాజిద్ ఖాన్, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.





## తిర్యానిలో పిచ్చికుక్కల స్వైర విహారం

తిర్యాని, అక్టోబర్ 07, ప్రభాతవార్త

తిర్యాని మండలంలో పిచ్చకుక్కలు స్వైర వివారం చేస్తున్నాయని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు రోజుల్లో 8మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గిన్నేధరి గ్రామానికి చెందిన మడావి రాజు, చింతపల్లి గ్రామానికి చెందిన నైతం శ్రీనివాస్, తొడసం మానిక్ రావు, విజయ్, తిర్యానికి చెందిన బొల్లం రాంచందర్, తలండికి చెందిన అక్షిత్, రాళ్ళకన్నెపల్లికి చెందిన కె వెంకటేశ్, చెలిమెలలో టేకం లక్ష్మిలపై దాడిచేసి గాయపర్చగా వీరంతా స్థానిక తిర్యాని మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు. మండలంలో పిచ్చి కుక్కల సంఖ్య ఎక్కువ కావడంతో బయటికి వెళ్ళాలంటే తాము భయాంధోళనలకు గురవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పిచ్చికుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బతుకమ్మ సంబరాలు

లక్ష్మణచాంద, అక్టోబర్ 07, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని ఆయా గ్రామాలలో సోమవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తీరక పూలతో బతుకమ్మలను పేర్చి కూడళ్ళ వద్ద పెట్టి బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అని ఆడి పాడారు. మండల కేంద్రంలో తదితర గ్రామాలలో చిన్నారులు యువతులు అందరూ సాంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నాయి. బతుకమ్మ చుట్టూ యువతులు నృత్యాలు చేశారు. అనంతరం మహిళలు పూలు సమర్పిస్తూ వెళ్లిరా.. బతుకమ్మ అంటూ వీడ్కోలు పలికి ఆయా గ్రామాల చెరువుల వద్ద నిమజ్జనం చేశారు.

## భారతీయ జనతా పార్టీ అత్యవసర సమావేశం

బోథ్, అక్టోబర్ 07 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల కార్యచరణలో భాగంగా బుధవారం భారతీయ జనతా పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని. ఈ సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు బోరే రవీందర్ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బృందావన్ వెంచర్‌లోని మణికంఠ వాటర్ ప్లాంట్ రోడ్డు వద్ద నిర్వహించనున్న సమావేశానికి బోథ్, సొనాల మండలాల నాయకుడు, కార్యకర్తలు, ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఆశావాహులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

## పట్టభద్రులైన వైద్యుల సలహాల మేరకే ఔషధాలు వాడాలి

నేరడిగొండ, అక్టోబర్ 07, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన ఫార్మా కోల్డ్‌రిఫ్ మందులు వాడవద్దనీ పట్టభద్రులైన వైద్యుల సలహాల మేరకు ఔషధాలు ఉపయోగించాలని వైద్యాధికారి సద్దాం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్లలోపు చిన్నారులకు వాడే దగ్గు మందుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వైద్యానికి అర్హులు కానీ ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అధిక మోతాదు గల సిరప్‌లు రాసి ఇవ్వడం ద్వారా అది వాడిన చిన్నారులు కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురిచేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని చిన్నారుల ప్రాణాలు హరించే మందులు వాడొద్దని మండల వైద్యాధికారి సద్దాం తెలిపారు.

## ఆదివాసి పోరాట యోధుడికి ఘన నివాళులు

బోథ్, అక్టోబర్ 07 ప్రభాతవార్త



జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసి హక్కుల కోసం నైజాం సర్కార్‌తో పోరాడి అమరుడైన ఆదివాసి ఆరాధ్య దైవం కొమరం భీమ్ 85వ వర్ధంతి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి నాయకులు రాజ్ గోండ్ ఉద్యోగ సంఘల నాయకులు కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పందెం శంకర్, భూమన్న, దుర్వా విశ్వేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 07, ప్రభాతవార్త



ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఇటీవల, వ్యవసాయ శాఖతో సహా వివిధ రంగాల్లో ఉద్యోగాల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తూ మోసాలు చేస్తున్న దొంగలు పెరిగారని ఆయన తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి వచ్చిన సమాచారాన్ని నమ్మే ముందు, స్థానిక అధికారులతో సంప్రదించి, ఆన్‌లైన్ సేవా కేంద్రాల ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్‌లలో నోటిఫికేషన్లు విడుదలైనవా లేవా తనిఖీ చేయాలని ఆయన సూచించారు. ఖఉద్యోగాలిస్తామని నమ్మించి, దళారులకు లక్షల రూపాయలు చెల్లించి ఇబ్బందులు పడొద్దు,గగ అని ఆయన హెచ్చరించారు. అలాగే, ఖడబ్బు పెట్టుబడి పెడితే ఏడాదిలో రెట్టింపు అవుతుందిగగ అంటూ ఆకర్షించే ఆన్‌లైన్ మోసాల గురించి కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. ఇలాంటి మోసగాళ్లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, పిడి యాక్ట్ కింద అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డా. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సిర్పూర్ ప్రజలు ఏదైనా సమస్య ఎదురైతే, స్వేరోలు మరియు బిఆర్ఎస్ నాయకుల నుండి ఉచిత సలహా పొందవచ్చని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని ప్రాణహిత భవన్‌ను సంప్రదించాలని సూచించారు.



## అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకున్న పోలీసులు


చింతలమానేపల్లి, అక్టోబర్ 07, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డిఎస్పీ ఆదేశానుసారం కౌటాల సిఐ పర్యవేక్షణలో చింతలమానేపల్లి మండలం గూడెం చెక్‌పోస్ట్ వద్ద 26 ఆవులను మంగళవారం అక్రమ రవాణా చేస్తున్న ఐచర్ వ్యాన్‌ను ఎస్ఐ ఇస్లావత్ నరేష్ పట్టుకోవడం జరిగింది. మహారాష్ట్ర నుండి హైదరాబాద్‌కు ఆవులను అక్రమ రవాణా చేస్తున్న షకీల్, ఇర్ఫాన్, అసాద్ అనే ముగ్గురిని పట్టుకోనీ, ఐచార్ వ్యాన్‌ను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేయడం జరిగిందనీ ఎస్ఐ ఇస్లావత్ నరేష్ తెలిపారు.

## ఆధునిక సాంకేతిక వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

జన్నారం, అక్టోబర్ 07, ప్రభాతవార్త



ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న అధునాతన సాంకేతిక వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఈ కేంద్రాలలో వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ఇంటర్మీడియట్ కొరకు అదనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో గల రామ్ లక్ష్మిుమ్మణ్ రైస్ మిల్లును సందర్శించి రైస్ మిల్లుకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాల పురోగతిని పరిశీలించారు. రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లుల నిర్వాహకుల సమన్వయంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, క్లాత్/జూట్/బంజార బ్యాగ్స్ తయారీ, కంప్యూటర్ డిసిఏ వృత్తి విద్యా కోర్సులు నేర్చుకొనుటకు ఆసక్తి గల సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల కుటుంబంలోని మహిళలు, పరిసర ప్రభావిత గ్రామాల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్, రెండు ఫోటోలతో పాటు పూర్తి వివరాలతో ఈనెల 15వ తేదీలోగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

రామకృష్ణాపూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు క్యాతనపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమీషనర్ గద్దె రాజు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మందమర్రి, అక్టోబర్ 07, ప్రభాతవార్త

మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, యూనియన్ నాయకులు ఉన్నతాధికారులు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు వాల్మీకి జయంతి లేదా పర్గత్ దివస్ అని పిలువబడే వాల్మీకి జయంతి, భారతీయ చంద్రమాన క్యాలెండర్‌లో అశ్విన్ మాసంలోని పౌర్ణమి రోజున (పూర్ణిమ) వస్తుందని, ఇది సాధారణంగా సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో వస్తుందని, రామాయణం అనే మహాకావ్యాన్ని రచించిన ఋషిని గౌరవించటానికి ప్రతి సంవత్సరం దీనిని జరుపుకుంటారు అని అన్నారు. మహర్షి వాల్మీకిని సంస్కృత సాహిత్యంలో ఆదికవి (మొదటి కవి), రామాయణ రచయితగా గౌరవిస్తూ ఆయనను స్మరించుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం విజయ ప్రసాద్, ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏ అధ్యక్షులు రమేష్, ఇన్చార్జి పర్సనల్ మేనేజర్ ఎండి ఆసిఫ్, సీనియర్ పిఓ సత్యనారాయణ, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్, అక్టోబర్ 07, ప్రభాతవార్త

రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, వాల్మీకి సంస్కృత భాషకు ఆదికవి అని, వాల్మీకి మహర్షి రామాయణ గ్రంథాన్ని రచించి పరిపూర్ణమైన విలువలను సమాజానికి అందించారని కొనియాడారు. మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శాలను మనిషికి అడుగడుగునా బోధించేలా రామాయణ కావ్యాన్ని రచించారని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు వారి ప్రతిభతో పై స్థాయికి వెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కె బాజి సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా సెక్రటరీ మల్లయ్య, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, డీజీఎంలు ఎస్. అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, ఎస్టేట్స్ అధికారులు వరలక్ష్మి, మహేష్, డివైపీఎం ఎం. రాజేష్, సీనియర్ పీవో పి. కాంతారావు, అకౌంట్స్ అధికారి పద్మ, సివిల్ ఇంజనీర్ భరత్ భూషణ్, జీఎం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.